క్లుప్తంగా

యామాపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దివాకర్

ఇబ్రహీంపట్నం: మండలంలోని యామాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్వర్యంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి దివాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాలు తప్ప లేకుండా కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యాన్ని తీసుకవచ్చి సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ క్రీడల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో పీడీ

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్‌స్కూల్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఇటీవల నిర్వహించిన ఎస్జీఎఫ్ క్రీడా పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపల్ నాగ సుధారాణి తెలిపారు. అండర్ –14 క్రికెట్ బాలుర విభాగంలో మణివర్ధన్, శశికుమార్, సీనియర్ విభాగంలో హరికృష్ణ, బాలికల అండర్ –17 విభాగంలో శ్రీమాని, హర్షిత, అండర్ 14 గర్ల్స్‌లో హాసిని అత్యంత ప్రతిభ కనబర్చినట్లు, వారిని పాఠశాలల పీఈటీ వినీత్‌కుమార్, అజీమ్ అభినందించారు.

వయోవృద్ధులందరూ పోలింగ్‌లో పాల్గొనాలి



వృద్ధులను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్

జగిత్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి వయోవృద్ధులందరూ పోలింగ్‌లో పాల్గొనాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంతో పాటు, కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులను ఆఖరి రోజు కావడంతో ఫారం డీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేసే సౌకర్యం ఉందని, ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. జగిత్యాలకు చెందిన నర్సయ్య, భాగ్యమ్మ దంపతులను సీనియర్ సిటిజన్స్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విశ్వనాథం, విజయ్, హన్మంతరెడ్డి, ప్రకాశ్‌రావు, సత్యనారాయణ, అశోక్‌రావు, కరుణ, రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

మెట్‌పల్లి: గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు వెంటనే ప్రారంభించాలని సింగిల్ విండో మాజీ చైర్మన్ అల్లూరి మహేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం మాట్లాడారు. వరి కోతలు ప్రారంభమైనప్పటికీ చాలా గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయలేదన్నారు. కొన్ని చోట్ల కేంద్రాలు ఉన్నప్పటికీ వాటిల్లో ఇంకా కొనుగోళ్లను మొదలు పెట్టలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గో బ్యాక్ 'కొప్పుల'



నామాపూర్‌లో వెలిసిన ఫ్లెక్సీ

పెగడపల్లి: మండలంలోని నామాపూర్‌లో గోబ్యాక్ 'కొప్పుల ఈశ్వర్' అంటూ మంగళవారం సాయంత్రం ఫ్లెక్సీ కట్టారు. 'మెఘా కంపెనీతో ఎవరికి ఉపయోగం.. రాష్ట్రంలో ఎక్కడైనా ఎకరాకు రూ.30 లక్షలు తగ్గకుండా పరిహారం ఇస్తే నామాపూర్‌లో మాత్రం రూ.7 లక్షల నుంచి రూ.9 లక్షలు మాత్రమే ఇచ్చారు.' అంటూ ఫ్లెక్సీ పెట్టారు. మంత్రి ఎన్నికల ప్రచారం కోసం నామాపూర్ వచ్చే లోపే అధికారులు ఆ ఫ్లెక్సీని తొలగించారు.

మొగులు.. అన్నదాతల దిగులు

- కమ్ముకొస్తున్న మబ్బులు..
- ఆందోళనలో రైతన్నలు
- వర్షాలు పడితే రైతులకు భారీ నష్టం



కొనుగోలు కేంద్రంలో కుప్పలుగా పోసిన ధాన్యం

పెగడపల్లి: రైతన్నలు ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే దశలో వర్షం భయం వెంటాడుతుండడంతో రైతన్నల్లో గుబులు మొదలైంది. వాతావరణంలో మార్పులతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటుండంతో రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వరి కోతలు కోసిన రైతులు వెంటవెంటనే ధాన్యాన్ని కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ సమయంలో వర్షాలు పడితే రైతులకు కోలుకోని విధంగా నష్టం వాటిల్లే ప్రమాదముందని చెబుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు ప్రతి ఏటా రైతులు నష్ట పోతూనే ఉన్నారు. ప్రధానంగా పంట చేతికొచ్చే దశలో వీటి ప్రభావం అధికంగా ఉండటంతో నష్టం కూడా అధికంగానే జరిగే అవకాశం ఉంటుంది. వర్షాలు కురిసినట్లయితే పంట నష్టపోయి ధాన్యం దిగుబడి తగ్గి రైతు నష్టం పోయే ప్రమాదం ఉంది. ప్రస్తుత సమయంలో పంటను కోసుకొనే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. వర్షం వస్తే మాత్రం పూర్తిస్థాయిలో నష్టపోక తప్పదని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలోని 23 గ్రామాలకు గానూ రెండు గ్రామాలు మినహా మిగతా గ్రామాలు ఎస్సారెస్పీ ఆయకట్టు ప్రాంతంలో ఉన్నాయి. దీంతో 90 శాతం మంది రైతులు వరిసాగు వైపే మొగ్గు చూపారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటున్న మరోపక్క అకాల వర్షాలు తమను ఎక్కడ ముంచుతాయోనన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది. సీజన్ ఆరంభంలో వాతావరణం అనుకూలించడం, ఆశించిన స్థాయిలో వర్షాలు రావడంతో రైతులు ఉత్సాహంగా పంట సాగు చేశారు. నియోజకవర్గంలో సుమారు 80 వేల ఎకరాలకు పైగా వరి సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పక్షం రోజులైతే గానీ పంట పూర్తిస్థాయిలో చేతికచ్చే పరిస్థితి. ఈ నేపథ్యంలో ఆకాశంలో కమ్ముకొస్తున్న మబ్బులు రైతును ఒక్క చోట నిలువ నీయడం లేదు. ఇప్పుడు గనుక వర్షం వస్తే పంటంతా నేలవాలి కోయడానికి వీలు లేకుండా పోతోంది. మబ్బుల కారణంగా రైతులు తీవ్ర ఆందోళన చెందుతూ దేవుడా కరుణించమని వరుణుడిని వేడుకుంటున్నారు.

మబ్బులతో భయం



నాలుగు ఎకరాల్లో వరిపంట సాగు చేశాను. వరికోసి కొనుగోలు కేంద్రానికి తెచ్చి నెల రోజులవుతుంది. కేంద్రాలు ప్రారంభించారు కానీ తూకం చేయడం లేదు. మబ్బులు వస్తుండటంతో భయంభయంగా ఉంది. పొద్దంతా ఎండబోసిన ధాన్యం రాత్రి కుప్ప పోసుకుంటున్నాం. వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలి.

– బానోత్ గంగనాయక్ ఏడుమోటలపల్లి తాండా

తూకం ప్రారంభించాలి



షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి. తేమ శాతం 17 వస్తేనే కొనుగోలు చేస్తామంటున్నారు. అసలే చలికాలం ఎండ తీవ్రత తక్కువగా ఉంటుంది. మంచు కురుస్తుండటంతో ధాన్యం ఆరబెట్టిందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వాతావరణంలో మార్పు చోటుచేసుకుని మబ్బులు వస్తున్నాయి. అకాల వర్షం వస్తే వరి రైతుల కష్టాలు తప్పవు.

– గుండ్లపల్లి కనుకరాజు, ఏడుమోటలపల్లి

అధికంగా వరిసాగు



ఆయకట్టు ప్రాంతమైన పెగడపల్లి మండలంలో వానకాలంలో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో వరిపంటనే సాగు చేశారు. పంట కోత సమయంలో అకాల వర్షాలు కురిస్తే దిగుబడి తగ్గి రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంటుంది. గింజ గట్టిపడితే పంటను రైతులు ఆలస్యం చేయకుండా కోసుకోవాలని సూచిస్తున్నాం.

– అశోక్, ఏఈవో

జీవనశైలి మార్పులతో క్యాన్సర్ నివారణ



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి వాహిని

మల్లాపూర్: జీవనశైలి మార్పులతోనే ప్రజలందరూ క్యాన్సర్‌ను నివారించవచ్చని పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ వాహిని అన్నారు. జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్‌పై కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి ముఖ్యంగా పర్యావరణ కాలుష్యం, వాతావరణంలో వచ్చే మార్పు వల్ల కూడా క్యాన్సర్ వస్తుందన్నారు. శరీరంలో ఏదైన ఒక అవయవ భాగంలో కణజాలం అపరిమితంగా, నియంత్రణ లేకుండా పెరగడం, ఇతర కణజాలానికి వ్యాపించడం వల్ల గడ్డలు ఏర్పడి అనారోగ్యస్థితిని క్యాన్సర్ వ్యాధిగా నిర్ధారిస్తారన్నారు. అతిప్రమాదకరమైన, ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధికి పూర్తిస్థాయి చికిత్స లేదన్నారు. క్యాన్సర్ రాకుండా నివారించేందుకు గాని, తొలిదశలోనే గుర్తించి చికిత్సతో నయం చేయవచ్చన్నారు. అనంతరం మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌వో రామ్మోహన్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ ఇందిర, శ్రీనివాస్, స్టాఫ్‌నర్స్ సుమ, ల్యాబ్ టెక్నిషన్ ఉమాదేవి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్‌ఎం అంజమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శిశు సంక్షేమ శాఖ విధులపై అవగాహన



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ధర్మపురి: శిశు సంక్షేమ శాఖలను సద్వినియోగం చేసుకోవాలని మహిళా సాధికారత జిల్లా కో–ఆర్డినేటర్ అశ్విని తెలిపారు. ధర్మపురి పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు శిశు సంక్షేమ శాఖలపై అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు మహిళా శక్తి స్కీమ్, బేటి బచావో, బేటి పడావో, సుకన్య సమృద్ధి యోజన, మహిళా సాధికారత, 181 సఖీ,1098 చైల్డ్ హెల్ప్‌లైన్, బాల్య వివాహాలతో కలిగే నష్టాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాని కోరారు. అనంతరం సంక్షేమ శాఖలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.



పట్టుకున్న నగదుతో పోలీసులు

రాయపట్నం వద్ద రూ.2.06 లక్షలు పట్టివేత

ధర్మపురి: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మంగళవారం రాయపట్నం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎలాంటి ఆధారాలూ లేకుండా తీసుకెళ్తున్న రూ. 2,06,940 పట్టుబడినట్లు ఎస్సై దత్తాత్రి తెలిపారు. డబ్బును గ్రీవెన్స్ కమిటీకి అప్పగించామని తెలిపారు.

బీజేపీ మండల కన్వీనర్‌గా గోపిడి శ్రీనివాస్‌రెడ్డి



మల్లాపూర్: మండల కేంద్రానికి చెందిన గోపిడి శ్రీనివాస్‌రెడ్డిని బీజేపీ మండల కన్వీనర్‌గా నియామకం చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు మంగళవారం తెలిపారు. ఈ మేరకు గోపిడి శ్రీనివాస్‌రెడ్డికి ఆయన నియామక పత్రాన్ని అందించారు. మండలంలో బీజేపీ అభ్యర్థి, ఎంపీ అరవింద్ గెలుపుకు కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

ఆర్టీసీ బస్సు పునరుద్ధరించాలి

సారంగాపూర్: కళాశాలకు వెళ్లడానికి ఆర్టీసి బస్సు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, బస్సును వెంటనే పునరుద్ధరించాలని సారంగాపూర్ జూనియర్ కళాశాల విద్యార్థులు కోరుతున్నారు. మంగళవారం వారు మాట్లాడుతూగాపూర్ జూనియర్ కళాశాలకు రేచపల్లి, పోతారం, బట్టపల్లి గ్రామాల నుండి కళాశాలకు 80 మంది విద్యార్థులు వస్తుంటామని తెలిపారు. గతేడాది జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం జగిత్యాల నుంచి రేచపల్లి మీదుగా బట్టపల్లి, పోతారం సారంగాపూర్‌కు వరకు, తిరిగి కళాశాల అయిపోగానే విద్యార్థులను తీసుకెళ్లే విధంగా బస్సును ఆర్టీసీ అధికారులు నడిపించారని తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు కావస్తున్నా ఇప్పటికి బస్సును నడిపించడం లేదని అధికారులు ఈ విషయంపై దృష్టిసారించాలని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తామని తెలిపారు.

గల్ఫ్ కార్మికురాలికి ఏఐఎఫ్‌బీ బీ ఫారం



కాంతకు బీఫాం అందిస్తున్న సురేందర్‌రెడ్డి

ధర్మపురి: ధర్మపురి నియోజకవర్గం నుంచి ఏఐఎఫ్‌బీ పార్టీ అభ్యర్థిగా గల్ఫ్ కార్మికురాలు బూత్కూరి కాంత పోటీ చేసేందుకు పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి కరీంనగర్‌లో బీఫాం అందించారు.

బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు

బుగ్గారం:సీఎం సభ నేపథ్యంలో జగిత్యాల–ధర్మపురి మధ్యన నడిచే బస్సుల సంఖ్య తక్కువగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జగిత్యాల డిపోలో మొత్తం 112 బస్సులు ఉండగా జగిత్యాల నుంచి మంచిర్యాల వరకు వయా ధర్మపురి మీదుగా ప్రతి నిత్యం 40 ట్రిప్పులు నడుస్తుంటాయి. అయితే మంగళవారం బస్సుల కొరతతో ఈ సంఖ్య బాగా తగ్గింది. కేవలం 12 ట్రిప్పులు మాత్రమే నడిచినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. డిపోలోని 50 బస్సులను బహిరంగ సభకు కేటాయించినట్లు డిపో మేనేజర్ తెలిపారు.ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రం నుంచి పలు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సులను రద్దు చేశారు. దీంతో జగిత్యాల,కరీంనగర్‌కు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదే అదనుగా ప్రయివే టు వాహనదారులు చార్జీలను రెట్టింపు చేయడంతో ప్రయాణికులపై అదనపు భారం పడింది. దీంతో ఆస్పత్రులు, పాఠశాలలు, కార్యాలయాలకు వెళ్లే వారు అసౌకర్యానికి గురయ్యారు.

చిత్ర కథ – క్రీడా ప్రాంగణమే కొనుగోలు కేంద్రం



కథలాపూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వం ప్రత్యేకంగా స్థలం కేటాయించకపోవడంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారు. కథలాపూర్ మండలం దూలూర్, పెగ్గెర్ల గ్రామాల్లో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాల్లోనే రైతులు ధాన్యం కుప్పలు పోసి అరబెడుతున్నారు. ధాన్యం పోసేందుకు స్థలం లేకపోవడంతో క్రీడా ప్రాంగణంలో పోసినట్లు రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు ప్రత్యేకంగా స్థలం కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

కొనసాగుతున్న శత చండీయాగం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మంటపంలో చేపట్టిన శతచండీయాగం మంగళవారం నాలుగో రోజుకు చేరుకుంది. బ్రహ్మశ్రీ తిగుళ్ల విషుశర్మ నేతృత్వంలో జరుతున్న ఈ యాగంలో నాలుగోరోజు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దంపతులు, బీజేపీ అభ్యర్థి భోగ శ్రావణి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి వేదపండితులు ఆశీర్వచనాలతో పాటు అమ్మవారి ప్రసాదం అందజేశారు. వేద పఠనం, పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎంపీవోకు సన్మానం



ఎంపీవోను సన్మానిస్తున్న ఎంపీడీవో, అధికారులు

కథలాపూర్: మండల ఎంపీవో గంగాధర్ ఇటీవల ఆదిలాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లడంతో.. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఘనంగా సన్మానించారు. ఏడాది పాటు మండలంలో ఎంపీవో గంగాధర్ అందించిన సేవలను అధికారులు కొనియాడారు. శాలువాలతో సన్మానించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జనార్ధన్, ఇన్‌చార్జి ఎంపీవో తౌఖీర్ అహ్మద్, ఏపీఎం నరహరి, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే ఇబ్బందే..

- ఉద్యోగులు జాగ్రత్త
- సాంస్కృతిక కళాకారుడిని సస్పెండ్ చేసిన కలెక్టర్

జగిత్యాల: జిల్లాలో విధులు నిర్వహిస్తున్న తెలంగాణ సాంస్కృతిక శాఖ కళాకారుడు సురేశ్‌నాయక్‌ను ఇటీవల విధుల నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏ పార్టీకి గానీ, దేనికైనా గానీ పక్షపాతంగా వ్యవహరిస్తే ఉద్యోగులకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఓ ప్రచార సభలో పాల్గొన్నందుకు ఇతనిని సస్పెండ్ చేశారు. ఉద్యోగులు కోడ్‌ను ఉల్లంఘిస్తే వేటు పడుతోంది. అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటం, నామినేషన్ల ప్రక్రియ సైతం కొనసాగుతుండటంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం ఏ మాత్రం ఏమరపాటుగా వ్యవహరించినా ఇబ్బందుల్లో పడాల్సి వస్తుంది. ఎన్నికలకు సంబంధించిన సమావేశాలు గానీ, సభల్లో గానీ ఎవరైనా ప్రత్యక్షంగా గానీ, రాజకీయ పార్టీలకు గానీ రాజకీయ పార్టీలకు మద్దతు తెలిపితే వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఉద్యోగులు ఎలాంటి రాజకీయ పార్టీలకు గానీ, సభల్లో గానీ పాల్గొనకూడదని నిబంధనలున్నాయి. ఇటీవలే ఓ ఉద్యోగి బీఆర్‌ఎస్ నిర్వహించిన సభలో పాల్గొనడంతో అతనిపై వేటు పడింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఉద్యోగి ఎన్నికల నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, ప్రతి ఉద్యోగికి కేటాయించిన విధులను మాత్రమే నిర్వహించాలని అధికారులు పేర్కొంటున్నారు.

ఉల్లి ధరల నియంత్రణపై కేంద్రం దృష్టి సారించాలి

మెట్‌పల్లి: ఉల్లి ధరల నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు అందె మారుతి మంగళవారం డిమాండ్ చేశారు. కిలో ఉల్లి ధర రూ.80 చేరుకోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పంట దిగుబడి తగ్గడం వల్ల రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశముందన్నారు. కేంద్ర ప్రభుత్వం ధరలనియంత్రణకు చర్యలు తీసుకోవడంతో పాటు సబ్సిడీపై అందించే ఆలోచన చేయాలన్నారు.

విశ్వరూప మహాసభ కరపత్రాల పంపిణీ



రామడుగు: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభ కరపత్రాలను ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం మండలంలోని వెదిర గ్రామంలో పంపిణీ చేశారు. మాదిగలు భారీగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ శంకర్ కోరారు. కార్యక్రమంలో నాయకులు కొత్తూరి రాజయ్య, శనిగరపు హన్మయ్య, గుడిసే విజయ్, రాము, పలువురు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు 'మోడల్' విద్యార్థులు

కొత్తపల్లి: మహబూబ్‌నగర్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్ పోటీల అండర్ –19 విభాగంలో కొత్తపల్లి మండలం ఎలగందుల లోని మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ వి.సరిత తెలిపారు. హ్యాండ్‌బాల్ పోటీలకు ఎం.మమూరి, బాస్కెట్‌బాల్ పోటీలకు పి.కీర్తన, కె.శివకుమార్‌లు ఎంపిక కావడాన్ని హర్షిస్తూ మంగళవారం వారిని అభినందించారు. విద్యార్థుల ఎంపిక పట్ల ఎస్‌ఎంసీ చైర్మన్ సుధాకర్, పీడీ ఎర్రం హరీశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.